# రాధాకృష్ణలీలలు ★

రచన :
"జగం"

అసలీ కాళాశాల విద్యార్ధినులు అందంగా ఉండరూ? ఒకవేళ కాస్త అంద విహీనమైనా మే (ను) కప్పుతో అజంతాసుందరుల్లాగా కన్పిస్తారు (వస్త్ర ధారణ పూర్తిగా ఉంటుంది స్మండీ) ఇంతకూ మన కథలో అమ్మాస్వతహాగ చాలా అందమయినదే. అందమైన భార్యకు పూలు తీసుకెళ్తున్న అబ్బాయి అయినా ఆమెను చూస్తె ఒక్కసారి చలించకమానడు. ఇంతెందుకు - మా "అనంద్ మఠం"లోని రాధాకృష్ణగాడే కనుక ఆ అమ్మాయిని చూస్తె ఒక ప్రబంధమే వ్రాసేస్తాడు అనుకోండి. ప్చ్. కానీ బ్యాడ్‌లక్, వాడు ప్రస్తుతం మద్రాసులో B. Sc., ఫైనల్ అఘోరిస్తున్నాడు మనమేమో ఈ హైద్రాబాద్‌లో B.A. Final వెలిగిస్తున్నాం - ఇంతెందుకు చెప్తున్నానంటే ఆ సుందరాంగి నా లాడ్జికి ఎదురుగా ఉన్న బంగళాలోనే ఉంది కాబట్టి ఇంతకూ ఆసుందరి పేరు చెప్పడం మర్చా! ఆమె పేరు కృష్ణలీల.

★ ★ ★

లోకంలో అందమంతా ప్రోగయి ఆ కుర్చీలో ఉందా అన్పిస్తుంది. కుర్చీలో కూర్చుని లీల ఏదో పత్రిక దీక్షగా చదువుతోంది. కథ అయిపోయింది కామోసు. ఏం వ్రాశారో ఏమో? కోపంగా ఆ రచయిత పేరుకోసం వెదుకుతోంది...

"హుఁ! రాధ! అమ్మాయిగారే నన్న మాట; ఆడవాళ్లే అన్ని అనర్థాలకు కారణము అట! లోకంలో చెడుఅంతా ఆడదాని మూలానే అట! ఎవరబ్బా ఈ స్వజాతిద్వేషి. ఒక ఆట ఆడించి చూడవలెను" అనుకుంది లీల. అనుకోవడమేమిటి, వెంటనే రాధ అడ్రసు పత్రిక వాళ్ళకు వ్రాసి తెప్పించుకొంది. ఒక్కసారి అడ్రసుపైకి చదువుకుంది.

కుమారి రాధ - C/o P. R. K. మూర్తి, మద్రాసు-2.

"ఒహెూ! అమ్మాయిగారు ఇంకా అవివాహితులే అన్నమాట, ఇంకేం బాగా ఏడ్పించవచ్చు" అనుకుంటూ ఆమె పేరుకు తనపేరు "కృష్ణ"గామర్చి ఉత్తరం వ్రాయ మొదలిడింది.

హైదరాబాద్,
20-11-60.

కుమారి రాధ గార్కి,

కృష్ణ అనే సాహిత్యాభిమాని నమస్కరిస్తూ వ్రాయునది—నేను మీరు వ్రాసిన కథ చదివాను. నాలో నేనే ఎంతో మధురానుభూతి పొందాను అహఁ! స్త్రీని ఎంత చక్కగా విమర్శించారు. ఇంత పిన్న వయస్సు లోనే అంతటి విమర్శక భావాలను మీరు వ్రాశారంటే అభినందించలేకుండా ఉండలేను. ఈ లాగే మీ రచనలన్నీ అత్యుత్తమస్థాయిని అందుకోవాలని ఆశిస్తాను. నేనుగా అకథను ఎంత మేచ్చుకున్నానో వ్రాయలేను.

చిన్నమనవి - నాకు 'పెన్‌ఫ్రెండ్స్' అంటే ఎంతో ఇష్టం. కాని ఇంతవర్కు నేనే పెన్‌ఫ్రెండ్‌కు ఉత్తరం వ్రాయలేదు. మీరు అనుమతిస్తే మనం ఉత్తరాలద్వారా సన్నిహిత స్నేహితులమవుదామని ఆశగావుంది. నా ఆశ ఫలింపచేస్తారుకదూ?

మరొక్కమాట మిమ్మల్ని 'కుమారి' గా వ్యవహరించాను. నా ఉచ్చారణ తప్పుకాదని తలుస్తాను.

మీ అభిమాన లేఖ కోసం ఎదురు చూస్తూ

కృష్ణ.

నా అడ్రసు.
T. కృష్ణ B.A. II year.
D. No: 0714
అబిడ్ రోడ్ - హైదరాబాద్—

అనుకున్న విధంగానే మరి అయిదు రోజుల్లో 'రాధ' దగ్గరనుండి జాబు వచ్చింది.

మద్రాసు-2
24-11-60

శ్రీకృష్ణగార్కి -

మీ ఆదరాభిమానాలతో కూడిన లేఖ అందినది. నాకు మీబోటి సాహిత్యాభిలాషులతో స్నేహం అంటే ఎంతోఇష్టం. ఇలాగే మన స్నేహం దినదినాభివృద్ధి చెందాలని ఆశిస్తాను. నేను మీరనుకున్నట్లు కుమారినే బి.ఏ. ద్వితీయ వత్సరం చదువుచున్నాను.

క్షమించండి! విద్యార్థిలోకం అంటేనే గిట్టనినేను - పదిమంది విద్యార్ధులనయినా ఏడ్పించిననేను, మీలేఖచూసిన మరుక్షణం నుండి మీతో స్నేహంచేయాలని ఎందుకో నామనస్సు ఉవ్విళ్ళూరుతుంది. మనస్నేహం ఇలాగే వృద్ధి పొందాలని కోరుతున్నాను.

ఇంకొకమాట మీరు అవివాహితులని తలుస్తాను.

ఇట్లు మీ కలం స్నేహితురాలు,
రాధ.

★ ★ ★

హైదరాబాద్,
27-11-1960

మీఉత్తరం చదివింతర్వాత నేనెంత ఆనందపడ్డానో నాయీ అల్పకలానికి వ్రాయనలవి కాదు. అంతెందుకు నోటితో కూడా చెప్పలేను. నేను కూడా "గర్ల్స్" ఉన్న కాలేజిలో చదువుతూ ఉన్నాను. కానీ ఆ విద్యార్థినులంటే నాకు గిట్టదు - అంతెందుకు నా కోసం నా ప్రేమకోసం తాపత్రయపడిన పదిమంది Girls వున్నారంటే అతిశయోక్తి గాదు. నన్నుగురించి పొగడుకుంటు

న్నానని మీరనుకోకపోతే ...... నన్ను కాలేజీలో "అవర్ కాలేజీ బ్యూటీ" అని హీరో నాగేశ్వరరావు అని చంపుకుతింటారు.

తండ్రి తాతలు సంపాయించిన లక్ష రూపాయలకు ఏకైక వారసుణ్ణిగా ఉంటు ఈ జంటనగరాలలో ఊసుపోక B.A. సాగిస్తున్నాను.

ఉత్తరం కోసం ఎదురుచూస్తూ,
స్నేహితుడు,
కృష్ణ.

* * *

మద్రాసు-2,
30-11-1960

శ్రీకృష్ణ గార్కి,

దయవుంచి ఇకనుండి మీరు నన్ను "అండీ అని గాని మీరు" అని గాని సంబోధించవద్దు అని ప్రార్థన. రాధా! అని సంబోధించండి. నాకు పరమ సంతోషంగా ఉంటుంది. మీ ఉత్తరం క్లాసులో గుర్తుకువచ్చి, నాలో నేనే సిగ్గుపడ్డాను. ముసిముసి నవ్వులు నవ్వుకుంటాను. స్నేహితులు ఏమే! ప్రణయలేఖ ఏమన్నా గుర్తుకు వచ్చిందా జమునా! అనేవారు. నన్ను 'జమున' క్రింద జమకట్టేరు మరి ఏమేమో వ్రాయవలెనని నా పెన్ను పురకలెతుతుంది - కాని అబలను...అనుభవం లేనిదానను ......ఎలా వ్రాయాలో తెలియుడంలేదు ......మీరే ఉత్తరం వ్రాయండి!

ఇట్లు మీ......
రాధ

* * *

హైదరాబాద్,
2-12-1960.

Dear రాధా!

నాలో రేగిన తీయని కోర్కెలు తీర్తాయని ఆశిస్తున్నాను... కాదు అత్యాస పొందు తున్నాను. నీ లేఖ నన్ను అనందపు అంబుధిలోని అల వలె తయారు చేసి, ఉవ్వెత్తునలేచే నాయీ హృదయ పుటల చెలియలకట్టవలె వున్న నీ దరి చేరాలని తాపత్రయ పడుతుంది. నిజంగానే ఆగిపోని మన ఈ లేఖలే 'మన' జీవితాన్ని సుఖమయం చేస్తాయని ఆశిస్తాను. దైవికంగా మనం ఉత్తరాల ద్వారా కలుసుకున్నాం ...... దైవికంగానే మన పేర్లూ కలసినాయి......నా భావం అర్థమయే ఉంటుం దనుకుంటాను.

మీ...తప్పుకదూ! నీ అమృత హస్తాలతో శుభవార్త అతిత్వరలో వ్రాస్తావు కదూ? ఇక నుండి నివు కూడ "కృష్ణ" అనే వ్యవహరించాలి.

ఇట్లు
పూవు దరిచేరే తుమ్మెద-
కృష్ణ

* * *

మద్రాసు-2,
8-12-1960.

డియర్ కృష్ణాజీ!

నిజంగా నాలో దాగిన మధుర భావములు ఏదైవమో మన భావి సుఖాన్నాసించి మనలను కలుప బోతున్నాడే 'మోనని' అనిపిస్తుంది.........అబలను అంతకంటే ఏమి వ్రాయగలను? మన ఈ హృదయాలు దూర దూరాలలో అంతు తెలియని చీకట్లలో కొట్టుమిట్టాడటం నే సహించలేను. నాకు ఈనెల 15వ తేదికి పరీక్షలయిపోతవి. మీ హైదరాబాద్ లోనే మా చిన్నాయన ఉన్నాడు. వాళ్ళ ఇంటికి మీకోసమైనా తప్పక వస్తాను అప్పుడు మన హృదయాలు విప్పుకొని మాట్లాడదాం! అంత వరకు స్వాతివానకు ఎదురు చూసే ముత్యపు చిప్పలా వేచియుంటాను.

ఇట్లు
త్వరలో కాబోయే మీపాదదాసి,
రాధ.

శలవు లొచ్చాయి. ఏంచెయ్యాలో తోచక కుర్చీలో కూర్చుని పేపరుచదువుకుంటున్నాను. శలవులకు కొంపకుపోయేవాణ్ణి! కానీ ఫ్రెండ్ రాధా కృష్ణగాడు వాళ్ళమ్మగార్ని తీసుకొని వస్తాడట. ఇలాగే ఆలోచనలతో మునిగి వున్నాను. ఇంతలో నా వీపు మీద దభేలుమని దెబ్బ పడింది. వెనక్కు తిరిగి చూస్తే ...ఇంకెవడు దరిద్రుడు రాధ గాడే. ఆనందంతో కావలించు కున్నాము.

"రా!రా!! జగం మా అమ్మగార్కి పరిచయం చేస్తాను. అరే నీ ఎదురు బంగళా లోనే రా మా చిన్నాన్న ఉండేది" అన్నాడు.

"అక్కడ కయితే నే చస్తేరానురా" అన్నాను. "అదేం రోగంరా?" అన్నాడు రాధ.

"అదేరా అయింటి యజమాని కూతురు ఉందిలే! అ జవ్వని మహా పెంకిరా బాబు. మనపని కాళీరా!" అన్నాను.

ఓరి పిరికిసన్నాసి రా-రా!... అంటు నన్ను లాక్కుపోయాడు.

* * *

కాఫీ పలహారాలయ్యాం తర్వాత రాధా కృష్ణ వాళ్లమ్మగారు వాళ్ళ పిన్నిగార్ను, చిన్నాన్న గార్ను సాలార్జంగ్ మ్యూజియంకు పోయారు. నేను రాధకృష్ణ హుస్కులోకి దిగాం......

అంతా అయిం తర్వాత - రాధగాడు "వరే! నా కథలు చదువుచున్నావురా?" అన్నాడు.

ఓ! చదవకేం... అంతా బాగానే ఉందికాని... అదేం ఖర్మరా అడదాని పేరెట్టుకుని "రాధ" అని వ్రాస్తున్నావు అని అన్నాను.

వాడు కడుపుబ్బేటట్టు నవ్వుతూ — అరే - రాధ అనే పేరుతో కథలేకాదురా బ్రదర్, ప్రేమలేఖలే సాగించారా -

ఈ హైదరాబాద్ నివాసిలో ఎవడో కృష్ణ అట! అంటూ మళ్లా నవ్వడం మొదలెట్టాడు.

ఎవరా నివాసి? ఏమా కథ?? అన్నాను ఆసక్తితో.

“అరేఁ! నే నిజంగా ఆడదానినే అనుకుని ఒక పురుష పుంగవుడు నాకో “అభినందన లేఖ” వ్రాశాడు. దాంతో మనం మరోలేఖ “రాధ” పేరుతోనే వ్రాశా. అలా రెండు మూడు ఉత్తరాల తర్వాత కుఱ్ఱవాడు ప్రణయంలోకి దిగినాడు” అన్నాడు.

నాకు నవ్వాగలేదు. తెగనవ్వాను వాడు ఉత్తరాన్ని విశదీకరిస్తుంటే!

అడ్రసు పెట్లోఉంది – నేను స్నానం చేసివస్తా అందాకా నీవు రూమ్‌కు పోయి “మేకప్”కా అలా బజారుకు పోదాము అన్నాడు. అల్లాగే అడ్రసు ఆ కృష్ణగార్ని కలుసు కుందాం! అన్నాడు.

ఇంతలో కిటికీ ప్రక్కనుండి ‘ఒహ’! అన్నమాటలు అకస్మాత్తుగా విన్పించినాయి. మాదృష్టి చురుకుగా అటు తిరిగింది. గాజులు గట్లతప్ప మరే శబ్దం రాలేదు. సరేనని నేను నా రూముకు వచ్చేసాను.

*   *   *

“స్నానం ఎచ్చట చేయాలండీ” ఏదో ఆలోచిస్తూ రాధాకృష్ణ.

“దొడ్లో పైపువుంది వెళ్లండి. “ఎవరా! అనుకుంటూ ఆ మంజుల స్వరాన్ని చూద్దాం అనుకుంటూ ముందుకు చూసాడు. ఒక్కసారే గుండే ఆగినంత పనయింది. బహుశా వాడి కళ్లకు అంత అందమయిన ఆడది కన్పించలేదేమో! అలానే చూస్తూ వెళ్ళలేక, వెళ్ళలేక బాత్‌రూమ్‌కు పోయాడు.

ఎల్లాగోస్నానం పూర్తిచేసి మరలా ఆ దివ్యసుందరమూర్తి దర్శన భాగ్యం లభిస్తుందేమోనని తొందరగా రూమ్‌కు వచ్చాడు.

టేబుల్ మీద చిన్న మడిచిన చీటి కన్పించింది. ఆతృతతో చూసాడు. అయ్యో బాబోయ్ అని కేకవేయబోయి ఆగాడు. అచీటి ఎవరో వ్రాసిందికాదు. “కృష్ణే”! హే! భగవాన్ ఎవడ్రా నాయినా ఈ పురుషోత్తముడు నాసంగతి తెలిస్తే వీపు చెక్కడుకదా అనుకుంటూ ఉత్తరం చదవసాగాడు.



డియర్ రాధా!

నీవు ఇచ్చటికి వచ్చావని చాలాసంతోషించాను. సాయంత్రం ఈ ఇంటివెనుక వున్న గార్డన్ దగ్గరకు వచ్చినన్ను కలుసుకో! మరువకేం?

ఇట్లు నీప్రియుడు,
కృష్ణ.

చంపావు గదరా నాయినా సాయంత్రము నీ కాళ్ళు పట్టుకుని అయినా క్షమాపణవేడుకుంటాను! అని గొణుక్కున్నాడు కథానాయకుడు.

*   *   *

సాయంత్రం 6గll లయింది. మెల్లగా అడుగులేసుకుంటూ గుండెలు గుప్పెట్లో పట్టుకునిచల్లగా గార్డెన్‌కు చేరుకున్నాడు. అసలే గుండెలు గుబగుబ లాడుతున్నాయేమో!

అలా......ఆ తోట్లో......ఆ సమయంలో ఆ......అఁ......సుందరాంగి ...తన ఎదురుగా కన్పించడంతో గుండె ఆగిపోయేది! కానీ అంత అందమయిన అమ్మాయిని చూస్తూ చావలేక ఊరుకున్నాడు.

“ఏఁవండీ గార్డెన్‌లో షికారు చేస్తున్నారు” ఏమిటోగా అడిగింది అప్సరస.

అబ్బే! “ఊరికనే” తడపడ్తూ జెవాబిచ్చాడు.

ఓ హో! ప్రియుని కోసమేమో” వెటకారంగా అడిగింది.

ఆఁ! నోరు తెరవబోయాడు తలవం చినట్లే.

"ఆశ్చర్యపోతారేం? రాధగారు! ఆటం బాంబు ఆ ప్రక్కనే పగిలిందేమో."

ఏం చేయాలో తోచక అచేతను డయ్యాడు; తేలుకుట్టిన దొంగలా!

భయపడకండి నేనే కృష్ణను ఉరఫ్ కృష్ణలీలను.

ఇహఁ వాడిస్థితి వ్రాయనలవికాదు.

అన్నీ తెలుసుకున్నాను. మీరు 'స్త్రీ' అని నేను

నేను "పురుషుడనని" మీరు పొర బడ్డాం. కానీ.........ఆపేసిందామె.

"కానీ మనం మాత్రం దంపతుల మవుదాం" ధైర్యంగా అనేశాడు హీరో!

అలాగా! అంటూ కిలకిలా నవ్వుతూ పరుగెత్తింది లీల కాదు కృష్ణలీల.

దొడ్డి గుమ్మం దగ్గర ఉన్న రాధగాడి తల్లి, పిన్ని, బాబాయి గార్లు నవ్వు కుంటున్నారు.

* * *

చూడండి మా వాడు ఎంతధైర్యంగా ఆమె తలమీద తలంబ్రాలు పోస్తున్నాడో లీల తన మెళ్ళోని మంగళసూత్రాన్ని చూసుకుంటూ ముసిముసి నవ్వులు నవ్వుతూంది.

"అరే - జగం" రాధగాడి అరుపు ఏమొచ్చిందిరా? అన్నాను.

"ఏంలేదురా మన అంటే "నా" వివాహగాథ కథగా వ్రాయరా? అర్డరు జారి చేశాడు


చంపావుపోరా! అదాసంగతి అయితే వ్రాస్తాం చూసుకో అంటూ కథ మొద లెట్టాను (అయిపోయిందిగా)

ఇంతకూ ఈ రాధాకృష్ణుల (నవీన) లీలలు కొంతమందయినా నమ్ముతారు కదూ.

★



మీరు కోరినవన్నియు సమకూడును



నమ్మకాన్ని విడపకండి! మీకార్యములన్నియు సమకూడును!! ఆశలన్నియు నెరవేరును!!! సూర్యచంద్రగ్రహణ ములలో పరిశుద్ధము చేయబడినది. ఈ మాంత్రిక ఉంగరమును ధరించినచో మీరు ప్రేమించిన ఏ స్త్రీ యయి నను ఎంతదూరంలో ఉన్నదయినను, మీ పాదాక్రాంతమై మీరు చెప్పినటుల చేయు టకు సిద్ధపడుదురు అన్ని అడ్డంకులను, విరోధములను జయించి మీరు ప్రేమించినవారినే పెండ్లిచేసుకొనవచ్చును. వ్యవహారములు, వర్తకము, చేతిపనులు, పరీక్ష మున్నగువానిలో విజయమును పొందవచ్చును. చెడ్డగ్రహములవలన యేర్పడునట్టి దుష్ఫలితములు మారి అదృష్టదేవతానుగ్రహమునకు పాత్రులు కాగలరు. దీర్ఘాయువు, ఎనలేని ఐశ్వర్యము, శాంతి సమాధానములతో జీవింపగలరు.



| | |
|---|---|
| మాంత్రిక ఉంగరము ఖరీదు | 1—15—0 |
| స్పెషల్ ఉంగరము | 3— 0—0 |
| స్పెషల్‌శక్తిని పొందినది | 3—15—0 |

విద్యుద్వేగములో ఫలితమిచ్చునది. ఫలితములేనిచో ఉంగరము ఖరీదు వాపస్ (తపాలఖర్చు వేరు)

RAJ JYOTISHI Pt. DEV DUTT SHASTRI TANTRIK, (C.G.M.) JULLUNDUR CITY, E. PUNJAB.